క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం



సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు ఈ నెల 12 న డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జి.ఎస్.వి.వి.కుమార్ సోమవారం తెలిపారు. 12న ఉదయం 11.00 గంటల నుంచి 12.00 గంటల వరకు డయల్ యువర్ డీఎం జరుగుతుందన్నారు. ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 9959225429 నెంబరుకు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

క్రోసూరు: మండలకేంద్రమైన క్రోసూరు శివారులో పేకాడుతున్న సమాచారంతో ఎస్ఐ ఎం.సత్యనారాయణ, సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,900 నగదు స్వాధీనపరుచుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా, ఏ ఊరిలోనైనా పేకాడుతున్నా, గుట్కాలు విక్రయించినా, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ ఫోను:9440796235కు తెలియచేయవచ్చునన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సత్తెనపల్లి: మహిళ మెడలో గొలుసు అపహరణకు గురైన ఘటన పట్టణంలోని రఘురామ్ నగర్‌లో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రఘురామ్ నగర్‌కు చెందిన వితంతు మహిళ తుమ్మల లక్ష్మీకుమారి కూరగాయలు కొనుక్కొని ఇంటికి వెళుతుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. దీంతో బాధితురాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించండి

సత్తెనపల్లి: సమగ్ర శిక్ష ప్రాజెక్టులో భాగంగా సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులైన సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ సత్తెనపల్లి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాథ్ ఠాగూర్, నంబుల విష్ణుమూర్తి సోమవారం విజ్ఞప్తి చేశారు. గత నాలుగు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక తదితర ఖర్చులతో మానసిక ఒత్తిడికి గురై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో పనిచేసే వారందరూ మహిళలు కావడంతో తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక విపరీతమైన మనోవేదనకు గురవుతున్నారన్నారు. మానవతా దృక్పథంతో వారికి తక్షణమే జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పంట నష్టం అంచనాలకు కమిటీల ఏర్పాటు



రాజుపాలెం(నకరికల్లు): ఇటీవల మిచాంగ్ తుఫాన్ వలన పంట నష్టపోయిన రైతులు ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పంట వివరాలను అందజేయాలని నకరికల్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. నకరికల్లు మండలంలోని గుండ్లపల్లిలో నష్టపోయిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ తుఫాన్ వలన నష్టపోయిన పంటలను అంచనా వేయడానికి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ వారం రోజుల పాటు తిరిగి నష్టపోయిన పంటలకు అంచనాలు తయారు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎం.ప్రసన్నకుమార్, వీఆర్వో ఎస్కే సైదా, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి గాయాలు

పిడుగురాళ్ల: సచివాలయ ఉద్యోగిపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపరిచిన ఘటన పట్టణంలోని 16వ సచివాలయంలో సోమవారం జరిగింది. ఘటనకు సంబంధించి బాధితుడు ఎ.అశోక్ కుమార్ తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని 16వ సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్ సచివాలయ పరిధిలోని 29వ వార్డుకు చెందిన షేక్ సైదావలి సచివాలయం ఇమ్యూనిటీ సెక్రటరీ ఫణితో వాగ్వాదానికి దిగటంతో అశోక్ గొడవ సర్దిచెప్పేందుకు వెళ్లటంతో అశోక్ వద్ద ఉన్న ఫోన్ లాక్కొని అదే ఫోన్‌తో అశోక్ తలపై బలంగా కొట్టటంతో గాయమై కుట్లు పడ్డాయని తెలిపారు. సచివాలయ సిబ్బంది పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో సైదావలిపై ఫిర్యాదు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద సచివాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

దొడ్లేరు సచివాలయం-1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



దొడ్లేరు సచివాలయం-1 లో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని మండల పరిషత్ అధ్యక్షుడు పెరుమాళ్లపల్లి కోటయ్య అన్నారు. మండలంలోని దొడ్లేరు సచివాలయం-1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలిది అప్పారావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సచివాలయం, వెల్‌నెస్ కేంద్రం, రైతుభరోసా కేంద్రం, నాడు-నేడు పనులతో పాఠశాలలు రూపురేఖలు మార్పు, సురక్షిత తాగునీటికి జలజీవన్ మిషన్ పథకం, సీసీరోడ్ల లాంటి నిర్మాణాలకు కోట్లాది రూపాయుల నిధులు కేటాయించటం జరిగింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించటం జరిగింది. ఇన్ని పథకాలు గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రజా సేవకుడిగా ప్రజల కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి , ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఆశీర్వదించేందుకు ప్రజలందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు, జెడ్పీటీసీ షేక్ జమీలాగపూర్, సయ్యద్ అబ్దుల్ రహీం, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు మీరావలి, నాగయ్య, సర్పంచ్ ముక్కు అంజలి, సయ్యద్ సైదా, కైపు రామకృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, అల్లా, ఓర్సు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలి



బెల్లంకొండలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా చేసిన మంచిని పార్టీ నాయకులు గ్రామాలలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రం కార్యాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని కార్యక్రమాలను, పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి ప్రజలకు మంచి చేస్తున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో కుల, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి లబ్ధి జరుగుతుందని పేర్కొన్నారు. 2024లో మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయడమే ధ్యేయంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మరియదాసు, అహ్మద్‌పాషా, పార్టీ నేతలు మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, భద్రయ్య, షేక్ దరియా, మండల సచివాలయ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, సర్పంచ్‌లు ఆసుల జగన్, నరసింహానాయక్, సైదయ్య, రమణారెడ్డి, బాబూజీ, లక్ష్మీనారాయణ, ప్రతాపరెడ్డి, ఎంపీటీసీలు, గ్రామ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోయిన బంగారంపై నష్టపరిహారానికి చర్యలు చేపట్టాలి



దొడ్లేరు సీజీజీబీ మేనేజర్ శివశంకర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం ప్రతినిధులు, బాధిత రైతులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో కుదవ పెట్టిన బంగారం గోల్‌మాల్ విషయమై వారం రోజుల్లో నష్టపరిహారం చెల్లించాలని సోమవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ శివశంకర్‌ను రైతులు, రైతు సంఘాల నాయకులు కలిసి మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ గతంలో కుదవ పెట్టిన ఆభరణాలు గోల్‌మాల్ అయి నష్టపోయిన రైతులకు, ప్రజలకు వెంటనే నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారం రోజుల్లో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని అన్నారు. బ్యాంకు మేనేజర్ శివశంకర్ మాట్లాడుతూ బ్యాంకులో మిస్సయిన బంగారంపై ఎంక్వయిరీ జరుగుతుందని, ఈ విషయంపై చర్యలు చేపట్టడానికి మరికొంత టైం పడుతుందన్నారు. బంగారానికి డబ్బులు చెల్లించేందుకు పై అధికారులు చర్చిస్తున్నారని కాబట్టి రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల ఆంజనేయులు, సాంబిరెడ్డి, రామకృష్ణారెడ్డి , చిన్న గోపి, రఫూఫ్, నాగుల్ షరీఫ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన



బీఎల్‌వోలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ సురేష్

సత్తెనపల్లి: మండలంలో పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన చేయడం జరుగుతుందని తహసీల్దార్ ఎస్.సురేష్ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ జీరో డోర్ నెంబర్‌పై గల క్లెయిమ్స్, 10 కన్నా ఎక్కువ ఓటర్లు గల డోర్ నెంబర్‌లపై, బూత్ లెవల్ అధికారుల డైరీ, ఈపీ రేషియో, జెండర్ రేషియో, పెండింగ్ క్లెయిమ్‌లపై, ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్‌పై దృష్టి సారించాలన్నారు. ఆయా అంశాలకు సంబంధించి బూత్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు, తదితరులున్నారు.

కొత్త రామకృష్ణకు బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు



గుంటూరు ఎమ్మెల్యే ముస్తఫా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: రేడియో రంజన్ 90.4 ఎఫ్ఎం రేడియో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అవార్డు ఫంక్షన్‌లో సత్తెనపల్లి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా వైద్యశాలను అభివృద్ధి చేసినందుకుగాను బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డుని గుంటూరు శాసనసభ్యుడు షేక్ ముస్తఫా, గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఎఫ్ఎం రేడియో రంజన్ యాజమాన్యం చేతుల మీదుగా సోమవారం కొత్త రామకృష్ణ అవార్డ్ అందుకున్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ కొత్త రామకృష్ణ చేసిన సేవలకు ప్రతిఫలంగా ఇది చాలా చిన్న అవార్డు అని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఎఫ్ఎం రేడియో రంజన్ అధినేత డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సమాజంలో మంచి పనులు చేస్తున్న గొప్ప వ్యక్తులకు విశిష్టమైన అతిథుల చేతుల మీదుగా అవార్డును అందిస్తామన్నారు. కొత్త రామకృష్ణతో పాటు మరో పదిమందికి అవార్డులు ప్రదానం చేశారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ పల్నాడు జిల్లా నుంచి తాను మాత్రమే అవార్డు అందుకోవటం అదృష్టంగా భావిస్తున్నానని, ఈ అవకాశం ఇచ్చిన ఎఫ్ఎం రేడియో రంజన్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నాణ్యతకు, మన్నికకు భారతి సిమెంట్



రెడ్డిగూడెంలో మేస్త్రీకి రూ.లక్ష ఉచిత బీమా బాండ్ అందజేసిన భారతి సిమెంట్ ప్రతినిధులు

రాజుపాలెం: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంట్‌ను ఎంచుకోవాలని భారతి సిమెంట్ అసిస్టెంట్(మార్కెటింగ్) మేనేజర్ పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.భవానీశంకర్ సూచించారు. మండలంలో రెడ్డిగూడెంలో గల పద్మా ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్ స్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలు చేసి నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తారని చెప్పారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి, బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మా ఎంటర్‌ప్రైజెస్ యజమాని కె.చిరంజీవి డీలర్లు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో పాల్గొనాలి




రాజుపాలెం: ఈ నెల 15వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీడీవో టి.శ్రీనివాసరావులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ఆట వస్తువులను పంచాయతీ కార్యాలయానికి సోమవారం అందించారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మాట్లాడుతూ 15 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఆటలలో పాల్గొనాలని తెలిపారు. నిష్పక్షపాతంగా ఆటలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లిఖార్జున శర్మ, జీడీసీఎంసీ డైరెక్టర్ ఆదినారాయణ, గణపవరం మాజీ సర్పంచ్ బుల్లిబాబు, గ్రామ సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో క్రిస్మస్ స్టార్‌ల సందడి



పాపాయపాలెం ఎస్సీ కాలనీలోని క్రిస్మస్ స్టార్

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాలలో క్రిస్టమస్ పండుగకు నెల రోజుల ముందు నుంచే సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని పలు గ్రామాలలో క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మండంలోని పాపాయపాలెం, బెల్లంకొండ, మన్నెసుల్తాన్‌పాలెం, నందిరాజుపాలెం, చండ్రాజుపాలెం, మచాయపాలెం, వెంకటాయపాలెం గ్రామాలలో పెద్ద ఎత్తున్న స్టార్‌లను ఏర్పాటు చేశారు. చర్చిలను రంగుల దీపాలతో అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



బెల్లంకొండలోని చర్చి కూడలిలో ...

భక్తిశ్రద్ధలతో నీలేశ్వరపాలెం తిరునాళ్ల

భారీగా తరలివచ్చిన భక్తులు



నీలేశ్వరపాలెంలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్న భక్తులు

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెంలో స్వయంభు గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 18వ శతాబ్దకాలం నుంచి కార్తీక మాసంలో వచ్చే చివరి సోమవారం తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ పూజారాలు వేకువజాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సమారాధన సంఘం ప్రతినిధులు సూరే సుబ్బారావు, సాంబశివరావుల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలు నిర్వహించారు. మహిళలు భజన కార్యక్రమాలు చేపట్టారు. మాల ధారణ అయ్యప్పలు, గురుస్వాములు, శివభక్తులు ప్రదర్శనలు నిర్వహించారు. వీరశైవల శరభ-దక్షరభల ప్రదర్శనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయం ముందు ఆకర్షణీయమైన స్టాల్స్ ఏర్పాటు చేశారు.

అచ్చంపేటలో....

కార్తీక చివరి సోమవారం సందర్భంగా స్థానిక హరిహర క్షేత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

పంట కోత ప్రయోగాలు బాధ్యతగా చేపట్టాలి

ఏవో వేణుగోపాల్



వరిపంట కోత ప్రయోగంలో ఏవో వేణుగోపాల్, రైతుభరోసా సిబ్బంది, రైతు

క్రోసూరు: పంట కోత ప్రయోగాలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయని అందుకుని రైతుభరోసా సిబ్బంది చాలా బాధ్యతగా చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పి.వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏవో ఆధ్వర్యంలో క్రోసూరులోని నంద్యాల పెద ఏడుకొండలు, సర్వేనంబర్ 612-1 వరి పొలంలో ప్రధామ మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంట కోత ప్రయోగం ఆర్బీకే సిబ్బంది సమక్షంలో చేసి చూపించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా వేయటం జరుగుతుందని, పంట బీమా పథకం పొందేందుకు పంట కోత ప్రయోగం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన పంట కోత ప్రయోగాల నిర్వహణలో క్షేత్రస్థాయి అధికారులైన ఆర్బీకే సిబ్బంది అలసత్వం వహించకుండా ఉండాలని అన్నారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరిలో-10, పత్తిలో-12, మిరపలో-4 పంట కోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఏడుకొండలు వరి పొలంలో చేపట్టిన పంటకోత ప్రయోగంలో భాగంగా వరిపైరులో ఎంపిక చేసిన మడిలో 25 చ.మీ వైశాల్యంలో వరి పైరును గుర్తించి అందులోని వరి దుబ్బులను కోసి, నూర్చి, తూకం వేయగా 17.350 కిలోల పచ్చి ధాన్యం వచ్చినట్లు తెలిపారు. ఇది ఎకరాకు 37 బస్తాల దిగుబడితో సమానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం సిబ్బంది ప్రదీప్, గోపి ,రైతులు పాల్గొన్నారు.

నష్టం అంచనాలు నమోదుపై దృష్టి



కట్టమూరు వద్ద పడిపోయిన వరి పంట(ఫైల్)



నీట మునిగిన మిరప పంట(ఫైల్)

- నిరంతర సహాయక చర్యల్లో యంత్రాంగం
- 5,542 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలకు నష్టం
- రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం

సత్తెనపల్లి: మిచాంగ్ పేరుతో విపత్తు సృష్టించి విలయతాండవం చేసి గడగడలాడించిన తుపాను వీడి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. తుపాను నష్టాలు మిగిలాయి. నేలకొరిగిన వరి పంట నీటిలో నానుతూ పంట నష్టం పెరుగుతోంది. పంట చేతి కందే దశలో అన్నదాతపై తుపాను రూపంలో ప్రకృతి కన్నెర చేసింది. వర్షానికి నష్టపోయిన రైతులందరికీ సాయం అందేలా కొండంత భరోసా నింపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో పంట నష్టంపై అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. వరి, శనగ, మిరప పంటలతో పాటు మొక్కజొన్న, కంది, అరటి, మునగ పంటలకు సైతం పంటనష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో తుపాను వర్షాలతో వాణిజ్య పంటలు సైతం ముంపు నీటిలోనే ఉన్నాయి. సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 5,542 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మంత్రి అంబటి చొరవతో..

తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు సత్తెనపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కొండంత భరోసా ఇచ్చారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పంట పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ధైర్యం చెబుతూనే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇక్కడి పరిస్థితి వేరు..

నియోజకవర్గంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ తుపాను ప్రభావం ఒక కారణమైతే వాగులు, వంకలకు పై నుంచి వచ్చే వరద కారణంగా పంట నష్టం జరుగుతుంది. పై నుంచి వర్షపు నీరు కొన్ని గ్రామాలను ముంచెత్తుతుంది. దీంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయి. నాలుగు నుంచి వారం రోజులపాటు నీరు నిల్వ ఉంటుంది.

రైతులు అధైర్య పడవద్దు



తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దానిలో భాగంగా ఇప్పటికే పడిపోయిన వరి, నీట మునిగిన మిరప, తదితర పంటలను పరిశీలించి ప్రాథమిక అంచనాల నివేదికను ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టాలు నమోదుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులెవ్వరు అధైర్యపడాల్సిన పనిలేదు.

– ఎస్. శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ, సత్తెనపల్లి

నియోజకవర్గంలో పంట నష్టం ప్రాథమిక అంచనాలు ఇలా....(హెక్టార్లలో)

మండలం	వరి	మిరప	శనగ	ఇతర పంటలు
సత్తెనపల్లి	55	200 హెక్టార్లు	285 హెక్టార్లు	04హెక్టార్లు
ముప్పాళ్ళ	128	70 హెక్టార్లు	1,200 హెక్టార్లు	103 హెక్టార్లు
రాజుపాలెం	330	220 హెక్టార్లు	40 హెక్టార్లు	65 హెక్టార్లు
నకరికల్లు	445	253 హెక్టార్లు	825 హెక్టార్లు	1,319

ఆలయాల్లో కార్తిక సోమవారం పూజలు



ముప్పాళ్ళ: మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక మాసం చివరి సోమవారం కావటంతో భక్తులతో ఆలయాలు నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లంకెలకూరపాడు గ్రామంలోని గంగా పార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి, కుందురువారిపాలెంలోని సాందీపని ఆశ్రమంలోను, చాగంటివారిపాలెం గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు.

హర హర మహాదేవ.. శంభో శంకర



పెద్దమక్కెనలో ప్రత్యేక అలంకరణలో గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి



ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి

సత్తెనపల్లి: పవిత్ర కార్తిక మాసం ఆఖరి సోమవారం వేకువజామునే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి అధిక సంఖ్యలో శివాలయాలకు వెళ్లి దీపారాధనలు చేశారు. శివయ్యకు పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'హరహర మహాదేవ .. శంభో శంకర' అంటూ భక్తుల హర నామస్మరణతో శైవ క్షేత్రాలు ప్రతిధ్వనించాయి. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, త్రిశక్తి దుర్గాపీఠంతో పాటు మండలంలోని పెదమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పెదమక్కెనలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఆటకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక మాస పూజలు

పెదకూరపాడు: 75 త్యాళ్లూరు గ్రామంలో అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం కార్తిక మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారులు నుదురుపాటి హనుమంతరావు శర్మ, హరినాథ శర్మలు స్వామివారికి పంచామృత అభిషకం, ఏకాదశ రుద్రాభిషేకం, మహాహారతి నిర్వహించారు. కార్తిక మాస పూజల్లో మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. శివసాయి ట్రస్టు ఆధ్వర్యంలో కార్తీకమాసం వనభోజనాలు ఏర్పాటు చేశారు.